


# కరపత్రం

SINCE 2014

శుక్రవారం మే 16 2025 | సంపుటి :0 | సంచిక :213 | - శివప్రసాద్, మేనేజింగ్ ఎడిటర్ | పేజీలు :4




# సరస్వతీనది పుష్కరస్నానమాచరించిన సీఎం రేవంత్‌రెడ్డి, మంత్రులు

- ప్రతిరోజూ సాయంత్రం సరస్వతి ఘాట్‌లో సరస్వతి నవరత్న మాల హారతి ఉంటుంది.
- కళా, సాంస్కృతిక కార్యక్రమాలు కూడా ఏర్పాటు చేశారు.
- భక్తుల బస కోసం తాత్కాలిక టెంట్ సిటీ నిర్మించారు.
- పుష్కరాల నిర్వహణకు రాష్ట్ర ప్రభుత్వం రూ.35 కోట్లు కేటాయించింది.
- తాగునీరు, పారిశుద్ధ్యం, ఘాట్ల నిర్మాణం, రహదారి మరమ్మతులు, పార్కింగ్ వంటి ఏర్పాట్లు చేశారు.

ళేశ్వరం:
జయశంకర్ భూపాలపల్లి జిల్లా కాళేశ్వరం క్షేత్రంలోని త్రివేణి సంగమంలో సరస్వతి నది పుష్కరాలు వైభవంగా ప్రారంభమయ్యాయి. గురువారం సాయంత్రం ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, రాష్ట్ర మంత్రులు పొన్నం ప్రభాకర్, శ్రీధర్‌బాబు, పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి తదితరులు సరస్వతీనది పుష్కరస్నానమాచరించారు. అనంతరం నదీ మాతకు హారతి ఇచ్చారు. ఆలయ ప్రాంగణంలో ఏర్పాటు చేసిన 10 అడుగుల సరస్వతిదేవి విగ్రహాన్ని, భక్తుల వసతి కోసం నిర్మించిన 86 గదుల సముదాయాన్ని సీఎం ప్రారంభించారు.
గోదావరి, ప్రాణహిత నదులతో పాటు అంతర్వాహినిగా సరస్వతి నది కలిసే ఈ త్రివేణి సంగమంలో ఈ నెల 26 వరకు ఈ మహాక్రతువు జరగనుంది. బృహస్పతి (గురువు) మిథున రాశిలోకి ప్రవేశంతో సరస్వతి నదికి పుష్కరాలు మొదలయ్యాయి. బుధవారం రాత్రి 10.35 గంటలకే బృహస్పతి (గురువు) మిథున రాశిలోకి ప్రవేశించి పుష్కరకాలం ప్రారంభమవుతున్నా.. గురువారం సూర్యోదయం నుంచి పుష్కర స్నానాలు ఆచరించాలని కాళేశ్వరం ఆలయ అర్చకులు వివరించారు. పేజి 2లో

## హైదరాబాద్, ముంబయిలో ఈడీ సోదాలు.. రూ.32 కోట్ల నగదు, బంగారం స్వాధీనం

- ముంబయి వసాయి విరార్ మున్సిపల్ కార్పొరేషన్ స్కామ్‌లో దర్యాప్తును ఈడీ ముమ్మరం చేసింది.



2లో

## యాదగిరిగుట్టను సందర్శించిన ప్రపంచ సుందరీమణులు

- మిస్‌వరల్డ్ పోటీదారులు గురువారం సాయంత్రం యాదాద్రి క్ష్మీనరసింహస్వామిని దర్శించుకున్నారు.



యాదగిరిగుట్ట, భువనగిరి:
మిస్‌వరల్డ్ పోటీదారులు గురువారం సాయంత్రం యాదాద్రి లక్ష్మీనరసింహస్వామిని దర్శించుకున్నారు. ఆలయ గెస్ట్‌హౌస్ నుంచి బ్యాటరీ వాహనాల్లో చేరుకున్న సుందరీమణులు అఖండ దీపారాధన మండపంలో జ్యోతి ప్రజ్వలన కార్యక్రమంలో పాల్గొన్నారు. వారి వెంట ప్రభుత్వ విప్ బీర్ల ఐలయ్య కుటుంబ సభ్యులు, జిల్లా అదనపు కలెక్టర్ వీరారెడ్డి, ఆర్డీవో కృష్ణారెడ్డి, ఆలయ ఏఈవో భాస్కర్ తదితరులు ఉన్నారు. అక్టోపస్, తెలంగాణ స్పెషల్ పోలీస్, ఆలయ ఎస్పీఎఫ్ సిబ్బంది భద్రతను పర్యవేక్షించారు.పోచంపల్లిలో ప్రపంచ సుందరీమణులు పేజి 2లో



## రూ. 8వేల కోట్ల 'ఫీజు' బకాయిలు.. తక్షణమే చెల్లించాలి: సీఎంకు బండి సంజయ్ లేఖ

హైదరాబాద్: తక్షణమే ఫీజు రీఎంబర్స్‌మెంట్ బకాయిలు చెల్లించాలని తెలంగాణ ప్రభుత్వాన్ని కేంద్రమంత్రి బండి సంజయ్ డిమాండ్ చేశారు. ఈ మేరకు సీఎం రేవంత్‌రెడ్డికి ఆయన లేఖ రాశారు. "ప్రభుత్వ నిర్లక్ష్యంతో రూ. 8వేల కోట్ల బకాయిలు పేరుకుపోయాయి. బకాయిలు చెల్లించకపోవడంతో ప్రైవేటు కళాశాలలు దిక్కుతోచని స్థితిలో ఉన్నాయి. ఇప్పటికే అనేక డిగ్రీ, ఇంజినీరింగ్ కళాశాలలు మూతపడ్డాయి. కొన్ని కాలేజీలు ఫీజులు చెల్లించనిదే విద్యార్థులకు సర్టిఫికెట్లు ఇవ్వట్లేదు. తక్షణమే ప్రభుత్వం స్పందించి ఫీజు రీఎంబర్స్‌మెంట్ బకాయిలు చెల్లించాలి"అని లేఖలో పేర్కొన్నారు.
పేజి 2లో



## కంచ గచ్చిబౌలి భూముల వ్యవహారం.. సుప్రీం కీలక వ్యాఖ్యలు

దిల్లీ: హైదరాబాద్‌లోని కంచ గచ్చిబౌలి భూముల వ్యవహారంపై సుప్రీంకోర్టు లో విచారణ జరిగింది. సీజేఐ జస్టిస్ బీఆర్ గవాయ్ నేతృత్వంలోని ధర్మాసనం విచారణ చేపట్టింది. విచారణ సందర్భంగా అత్యున్నత న్యాయస్థానం కీలక వ్యాఖ్యలు చేసింది. పర్యావరణ అనుమతులు తీసుకున్నారా? లేదా? అనేది స్పష్టం చేయాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని జస్టిస్ బీఆర్ గవాయ్ ప్రశ్నించారు. లాంగ్ వీకెండ్ చూసి ఎందుకు చర్యలు మొదలు పెట్టారని ధర్మాసనం మరోసారి ప్రశ్నించింది. నష్టాన్ని పూడ్చేందుకు తీసుకునే చర్యలను స్పష్టంగా చెప్పాలంది. పేజి 2లో


## భారత్ ఓవైపు.. పాక్ సైబర్ మంద మరోవైపు..!



2లో

- పాక్‌తో జట్టు కట్టిన అంతర్జాతీయ సైబర్ హ్యాకర్ల మందతో భారత్ ఒంటరిగానే పోరాడి నిలిచింది. దాదాపు ఆరు దేశాలకు పైగా హ్యాకర్లు పాక్‌తో

## నిద్రపోనివ్వకుండా రహస్యాలు అడిగి: పాక్ చెరలో బీఎస్ఎఫ్ జవాన్‌కు వేధింపులు



- కస్టడీలో ఉండగా బీఎస్ఎఫ్ జవాన్‌ను పాక్ అధికారులు దూషించి, వేధించినట్లు తెలుస్తోంది.

2లో

కరపత్రం
తెలుగు దిన పత్రిక
శుక్రవారం మే 16 2025

# బోధన్ సొసైటీ ఆధ్వర్యంలో జిలుగు విత్తనాల పంపిణీ...





**సాయికృష్ణ కట్కం, కరపత్రం ప్రతినిధి**
బోధన్ ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం ఆధ్వర్యంలో జిలుగు విత్తనాలు పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. గురువారం సొసైటీ అధ్యక్షులు ఉద్మీర్ లక్ష్మణ్ అధ్యక్షతన సొసైటీ కార్యాలయం ఆవరణలో జిలుగు విత్తనాల పంపిణీ ని ప్రారంబించారు. ఈ కార్యక్రమంలో బోధన్ పట్టణ వీడీసీ అధ్యక్షులు గంగాధర్ రావు పట్వారి, సంఘ వైస్ చైర్మెన్ మానబాయి వీరభద్రరావు, డైరెక్టర్లు సింగం లక్ష్మణ్, హీర్య నాయక్, పులి భాస్కర్, మండల వ్యవసాయ అధికారి సంతోష్, ఏఈవో లు కృష్ణవేణి, శ్యామల, శివాలయం చైర్మెన్ హరికాంత్ చారి, హనుమాన్ మందిరం చైర్మెన్ గుండేటి శంకర్, బీర్కుర్ శంకర్, ఉద్మీర్ సాయిలు, కర్నే గంగారాం, పట్టణ మైనారిటీ అధ్యక్షులు పాషా, పండిత్ రావు తదితరులు పాల్గోన్నారు. ఈ సందర్భంగా జిలుగు ఒక బ్యాగు 30కిలోల బస్తాకు 50శాతం గవర్నమెంట్ సబ్సిడీ పోను 2137.50 రైతు కట్టవలసి ఉంటుందని సంఘ కార్యదర్శి దేశ్ ముఖ్ ఉమాకాంత్ తెలిపారు.

# విద్యుత్ ఘాతానికి గురై అసిస్టెంట్ లైన్మెన్ మృతి.



**సాయికృష్ణ కట్కం, కరపత్రం ప్రతినిధి**
విద్యుత్ శాఖ అసిస్టెంట్ లైన్ మెన్ విద్యుత్ ఘాతానికి గురై మృతి చెందిన ఘటన బోధన్ మండలం రాజీవ్ నగర్ తాండ గ్రామంలో గురువారం చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం ఎడపల్లికి చెందిన మహేందర్(36) తన విధులలో భాగంగా విద్యుత్ కు సంబంధించిన మరమ్మతులు చేపడుతున్న క్రమంలో ప్రమాదవశాత్తు విద్యుత్ షాక్ తగిలి మృతి చెంది ఉంటారని వెల్లడించారు. మృతుడికి భార్య ఇద్దరు పిల్లలు ఉన్నారు.

# ట్రాఫిక్ సిగ్నల్స్,జీబ్రా క్రాసింగ్ ఏర్పాటు చేయాలి



**సాయికృష్ణ కట్కం, కరపత్రం ప్రతినిధి**
నగరంలోని బోధన్ బస్టాండ్ నుంచి అర్సపల్లి ఎక్స్ రోడ్డు వరకు ట్రాఫిక్ ఇబ్బందులను దృష్టిలో ఉంచుకొని వాకర్స్ కోసం బోధన్ రోడ్డులో ట్రాఫిక్ సిగ్నల్స్, జీబ్రా క్రాసింగ్ ఏర్పాటు చేయాలని ఎంఐఎం నగర అధ్యక్షుడు మహ్మద్ షకీల్ అహ్మద్ ఆధ్వర్యంలో నాయకులు ట్రాఫిక్ ఏసీపీ మస్తాన్ వలీకి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. బోధన్ బస్టాండ్, మాలపల్లి, అర్సపల్లి ఎక్స్ రోడ్డులతోపాటు, డెయిరీ ఫారం చౌరస్తాలో ట్రాఫిక్ సిగ్నల్స్ లేకపోవడంతో ఇబ్బందులు ఎదురవుతున్నాయని, తరచూ ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయని అన్నారు. ప్రజల ఇబ్బందులను దూరం చేయడంతోపాటు ప్రమాదాలను నివారించేందుకు సిగ్నల్స్, జీబ్రా క్రాసింగ్ లు ఏర్పాటు చేయాలని విన్నవించామన్నారు.వినతిపత్రం అందజేసిన వారిలో పార్టీ జిల్లా అధ్యక్షుడు ఫయాజ్ అహ్మద్, నగర కార్యదర్శి ముజీబ్ హైమద్, జాయింట్ సెక్రెటరీలు అజీజ్ హుస్సేన్,ఎండీ అవైజ్ అహ్మద్, కోశాధికారి మహ్మద్ అయాజ్ అహ్మద్,ఎగ్జిక్యూటీవ్ మెంబర్లు ఎండీ నజీర్, ఎండీ రియాజ్,అనీజ్ ఖాన్ రాహి, ఎంఏ అజీమ్ బాబా షేక్ ఖలీల్ అహ్మద్,మిర్జా అఫ్జల్ బేగ్,అమీర్ తదితరులు ఉన్నారు.

# నిజామాబాద్ సెంట్రల్ జైల్ సూపరింటెండెంటుగా దశరథ



**సాయికృష్ణ కట్కం, కరపత్రం ప్రతినిధి**
నిజామాబాద్ జిల్లా సెంట్రల్ జైల్ సూపరింటెండెంట్ గా చింతల దశరథం గురువారం బాధ్యతలు స్వీకరించారు. 1992వ బ్యాచ్ కు చెందిన ఆయన డిప్యూటీ జైలర్ గా, 2008లో జైలర్ గా పనిచేశారు. 2014లో సంగారెడ్డిలో జైళ్ల డిప్యూటీ సూపరింటెండెంట్ గా, 2025లో జైళ్ల సూపరింటెండెంట్ గా పదోన్నతి పొందారు.

# భారత్ ఓవైపు..

## పాక్ సైబర్ మంద మరోవైపు..!

మొదటిపేజీ తరువాయి
ఓవైపు భారత్ ఆపరేషన్ సిందూర్‌లో తలమునకలైన వేళ పాకిస్థాన్ మిత్రదేశాలు మొత్తం ఏకమై ఇండియాపై సైబర్ దాడులు నిర్వహించినట్లు మన దర్యాప్తు బృందాలు గుర్తించాయి. వీటిల్లో కొన్ని ఆయా ప్రభుత్వాల హ్యాకింగ్ గ్రూపులు కాగా.. మరికొన్ని ప్రభుత్వేతరమైనవి. పాకిస్థాన్, తుర్కియే, బంగ్లాదేశ్, మలేసియా, ఇండోనేసియా, ఇరాక్, చైనాకు సంబంధించినవి ఉన్నట్లు నిపుణులు గుర్తించారు.
ముఖ్యంగా ప్రభుత్వరంగ సంస్థలు, ఎంఎస్ఎంఈ వ్యాపారులు, పోర్టులు, ఎయిర్ పోర్టులు, పవర్‌గ్రిడ్, ట్రాన్స్‌పోర్టేషన్ సర్వీసులు వంటి వాటిని ఇవి లక్ష్యంగా చేసుకొన్నాయి. బీఎస్ఎన్ఎల్, యూపీఐ, డిజిటల్ వాలెట్స్, స్టాక్ ఎక్స్ఛేంజీలు, దిగ్గజ కంపెనీలు వీటిల్లో ఉన్నాయి. రక్షణ రంగ సంస్థల నుంచి కూడా డేటా చౌర్యానికి యత్నించాయి. దీనిని భారత డిజిటల్ ఆస్తులపై పాక్ చేసిన సైబర్ యుద్ధంగా ఇంటర్‌పోల్ ట్రెయిన్ పెండ్యాల కృష్ణశాస్త్రి వెల్లడించినట్లు ఓ ఆంగ్లపత్రిక కథనంలో పేర్కొంది. ఇటీవల ది సెంట్రల్ కోల్ ఫీల్డ్స్ లిమిటెడ్ సైబర్ దాడికి గురైంది. దాని సిస్టమ్‌లో మిస్టర్ హబిబ్404 పేరిట ఓ మెసేజ్ కనిపించింది. “సురక్షితమే అని మీరు అనుకొంటున్నారా.. మేము ఇక్కడే ఉన్నాం” అనే సందేశం కనిపించింది. ఆ తర్వాత ఈ వెబ్‌సైట్‌ను రీస్టోర్ చేశారు.

### ఏకమైన పాక్ అనుకూల గ్రూపులు ఇవే..

ఈ హ్యాకింగ్ గ్రూపుల్లో కొన్ని పేర్లు వెల్లడయ్యాయి. ఇస్లామిక్ హ్యాకర్స్ ఆర్మీ (ఇరాక్), టీమ్ అజ్‌రాయిల్-ఏంజెల్ ఆఫ్ డెత్ (పాలస్తీనా) సైల్హెట్ గ్యాంగ్ ఎస్‌జీ (బంగ్లాదేశ్) డైనెట్ (బంగ్లాదేశ్), ఏపీటీ 36, పాకిస్థాన్ సైబర్ ఫోర్స్, టీమ్ ఇన్సేన్ పాక్, మిస్టీరియస్ బంగ్లాదేశ్, ఇండో హ్యాక్ సెక్, సైబర్ గ్రూప్ హెూక్స్, నేషనల్ సైబర్ క్రూ (పాకిస్థాన్) వంటివాటిని గుర్తించారు. ఇవి గత వారం నుంచి తరచూ సైబర్ దాడులు చేసి భారత్ నుంచి డేటా చౌర్యం చేసినట్లు 100కు పైగా క్లెయిమ్‌లు చేశాయి. వీటిల్లో ఎంతవరకు నిజం అనే వాటిని భారత్ వర్గాలు మాత్రం ధ్రువీకరించలేదు. బంగ్లాదేశ్‌కు చెందిన సైల్హెట్ గ్యాంగ్ ఎస్‌జీ, డైనెట్‌లు భారత్‌లోని నేషనల్ ఇన్ఫర్మేషన్ సెంటర్ నుంచి 247 జీబీ డేటాను తస్కరించినట్లు పేర్కొన్నాయి. ఈ సంస్థలు వాటిల్లో కొంత బహిర్గతం చేయగా.. వాటిని క్లౌడ్ ఎస్ఈకే సంస్థ విశ్లేషించి అది పబ్లింగ్ అందుబాటులో ఉన్నదేనని వెల్లడించింది. అజ్‌రాయిల్-ఏంజెల్ ఆఫ్ డెత్ 10 లక్షల మంది ప్రజల డేటాను ఎలక్షన్ కమిషన్ నుంచి అపహరించినట్లు వెల్లడించింది. అది 2023లో రీసైకిల్ చేసిన డేటాగా తేలింది.
ఆపరేషన్ సిందూర్ వేళ పాకిస్థాన్ మద్దతుతో నడిచిన హ్యాకింగ్ సంస్థలు భారత పవర్ గ్రిడ్‌లో 70శాతం కుప్పకూల్చామని ప్రకటించుకొన్నాయి. కానీ, ఇది పూర్తిగా అవాస్తవమని పీఐబీ ఫ్యాక్ట్ చెక్ వెల్లడించింది. పాక్ యుద్ధంలో పైచేయి సాధించిందనే ప్రచారం కోసం శాటిలైట్ జామ్ చేశామని, నార్తర్న్ కమాండ్‌తో సంబంధాలు తెంపేశామని, బ్రహ్మోస్ స్టోరేజీ డిపోను పేల్చామని పాక్ ముఠాలు ప్రచారం చేసిన విషయం తెలిసిందే.

### ఒక ముప్పు వాస్తవమే..

పాక్‌కు చెందిన ఏపీటీ 36 గ్రూపుతో అప్రమత్తంగా ఉండాలని సైబర్ నిపుణులు చెబుతున్నారు. దీనికి ట్రాన్సపరెంట్ ట్రైబ్ అనే నిక్‌నేమ్ కూడా ఉంది. ఈ గ్రూపు మాల్వేర్ పేలోడ్స్ దాడులు చేస్తుంది. ఇది వాడే వాటిల్లో అల్లాకొరె, క్రిమిసన్ రాట్ వంటివి ఉంటున్నాయి. ఇవి సోకిన కంప్యూటర్లపై ఏపీటీ 36 గ్రూప్‌కు అపరిమిత నియంత్రణ లభిస్తుంది.

# నిద్రపోనివ్వకుండా రహస్యాలు అడిగి: పాక్ చెరలో బీఎస్ఎఫ్ జవాన్‌కు వేధింపులు

మొదటిపేజీ తరువాయి
పాక్ రేంజర్ల నిర్బంధంలో గత 21 రోజులుగా ఉన్న సరిహద్దు భద్రతా దళం (బీఎస్ఎఫ్) జవాన్ పూర్ణమ్ కుమార్ షా విడుదలైన సంగతి తెలిసిందే. పాక్ అదుపులో ఉన్నప్పుడు ఆయనను నిద్ర పోనివ్వలేదని, దూషించారని సంబంధిత వర్గాలు వెల్లడించాయి.
నిర్బంధంలో ఉన్నన్ని రోజులు పాక్ అధికారులు పూర్ణమ్‌ను మూడు ప్రాంతాల్లో తిప్పి ఒక లొకేషన్‌లో జైలు సెల్‌లో ఉంచారు. వారివద్ద ఉన్నన్ని రోజులు చాలావరకు కళ్లకు గంతలు కట్టే ఉంచారని సమాచారం. ఆయనను శారీరకంగా హింసకు గురిచేయలేదు కానీ.. మాటలతో మాత్రం వేధింపులకు గురిచేశారని ఆ వర్గాలు వెల్లడించాయి. కనీసం నిద్ర పోనివ్వలేదని, బ్రష్ చేసుకోవ్వలేదని తెలిపాయి. అలాగే సరిహద్దులో మోహరింపు గురించి, అక్కడ ఉండే సీనియర్ అధికారుల గురించి వివరాలు రాబట్టేందుకు ప్రయత్నించారని పేర్కొన్నాయి. కాంటాక్ట్ వివరాలు ఇవ్వాలని ఆ అధికారులు ఒత్తిడి చేశారని తెలుస్తోంది. అయితే బీఎస్ఎఫ్ నిబంధనల ప్రకారం ఆయన వద్ద ఎలాంటి ఫోన్ లేకపోవడంతో వారికి వివరాలు అందలేదు. ఇక ఈ ప్రశ్నలన్నీ అడిగిన అధికారులు సివిల్ దుస్తుల్లో ఉన్నారట.
‘ముందెళ్లి క్షమాపణ చెప్పండి’: కర్నల్ సోఫియాపై మంత్రి వ్యాఖ్యలపై సుప్రీం సీరియస్
పంజాబ్‌లోని ఫిరోజ్‌పుర్ సెక్టార్‌లో అంతర్జాతీయ సరిహద్దు వెంబడి రైతులకు రక్షణగా గత నెల 23న గస్తీ నిర్వహిస్తున్న సమయంలో పూర్ణమ్ అస్వస్థతకు గురయ్యారు. సమీపంలో ఓ చెట్టు కనబడటంతో దానికింద విశ్రాంతి తీసుకున్నారు. అది పాక్ భూభాగం అన్న విషయాన్ని గుర్తించలేకపోయారు. పాకిస్థాన్ రేంజర్స్ ఆయనను నిర్బంధంలోకి తీసుకున్నారు. జవాన్ విడుదల కోసం రెండు దేశాల భద్రతా దళాలు ఆరు సార్లు చర్చలు జరిపాయి. మరోవైపు పూర్ణమ్ కుటుంబసభ్యులు తీవ్రంగా ఆందోళన చెందారు.
గర్భిణి అయిన ఆయన భార్య.. భర్త విడుదల కోసం కేంద్రాన్ని వేడుకున్నారు. కొన్నాళ్లపాటు భారత్ అధికారుల అభ్యర్థనలు పట్టించుకోకుండా పాక్ రేంజర్లు కాలయాపన చేశారు. అయితే ఈనెల మొదటివారంలో రాజస్థాన్‌లోని శ్రీగంగానగర్ సమీపంలో మన భూభాగంలోకి ప్రవేశించిన పాక్ రేంజర్ మహమ్మదుల్లాను బీఎస్ఎఫ్ అదుపులోకి తీసుకుంది. దీంతో పాకిస్థాన్ పైనా ఒత్తిడి పెరిగింది. ఈ క్రమంలోనే పూర్ణమ్‌ను విడుదల చేసింది. బీఎస్ఎఫ్ కూడా పాక్ రేంజర్‌ను అప్పగించింది.

# కంచ గచ్చిబౌలి భూముల వ్యవహారం.. సుప్రీం కీలక వ్యాఖ్యలు

మొదటిపేజీ తరువాయి
కేంద్ర సాధికార సంస్థ దాఖలు చేసిన నివేదికపై కౌంటర్ దాఖలు చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం తరఫు న్యాయవాది సమయం కోరారు. పర్యావరణానికి జరిగే నష్టాన్ని పూడ్చే చర్యలు చేపట్టకపోతే సీఎస్ సహా కార్యదర్శులు జైలుకు పోవాల్సి ఉంటుందని ధర్మాసనం ఘాటుగా వ్యాఖ్యానించింది. ఈ సందర్భంగా విజిల్ బ్లోయర్స్, విద్యార్థులపై కేసుల విషయాన్ని పలువురు న్యాయవాదులు కోర్టు దృష్టికి తీసుకెళ్లారు. ఆ కేసులు కొట్టివేయాలని అప్లికేషన్ దాఖలు చేసినట్లు తెలపగా.. ఈ పిటిషన్‌తో కలిపి విచారించడం కుదరదని సీజేఐ స్పష్టం చేశారు. కావాలనుకుంటే వేరే పిటిషన్ దాఖలు చేసుకోవచ్చన్నారు. అనంతరం తదుపరి విచారణను జులై 23కి సుప్రీంకోర్టు వాయిదా వేసింది.

# బీబీనగర్‌లో ఎయిమ్స్ విద్యార్థి ఆత్మహత్య



బీబీనగర్: యాదాద్రి భువనగిరి జిల్లా బీబీనగర్‌లో వైద్య విద్యార్థి ఆత్మహత్య చేసుకున్నాడు. స్థానికంగా ఉన్న పెద్దచెరువులో దూకి బలవన్మరణానికి పాల్పడ్డాడు. మృతుడిని బీబీనగర్ ఎయిమ్స్‌లో ఎంబీబీఎస్ మూడో సంవత్సరం చదువుతున్న అభిజిత్ (23)గా గుర్తించారు. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనాస్థలికి చేరుకుని మృతదేహాన్ని చెరువు నుంచి వెలికి తీశారు.

# సరస్వతీనది పుష్కరస్నానమాచరించిన సీఎం రేవంత్‌రెడ్డి, మంత్రులు

మొదటిపేజీ తరువాయి
ఇవాళ వేకువజామున 5.44 గంటలకు సరస్వతి ఘాట్ వద్ద శ్రీగురు మదనానంద సరస్వతి పీఠాధిపతి మాధవానంద ప్రత్యేక పూజలు నిర్వహించి పుష్కరాలను లాంఛనంగా ప్రారంభించారు.

### సరస్వతి నవరత్న మాల హారతి

ప్రతిరోజూ సరస్వతి ఘాట్‌లో సాయంత్రం 6.45 నుంచి 7.35 గంటల వరకు సరస్వతి నవరత్న మాల హారతి ఉంటుంది. దీంతోపాటు కళా, సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటుచేశారు. భక్తులు రుసుము చెల్లించి బస చేసేందుకు వీలుగా తాత్కాలికంగా టెంట్ సిటీని నిర్మించారు. పుష్కరాల నిర్వహణకు రాష్ట్ర ప్రభుత్వం రూ.35 కోట్లు కేటాయించింది. తాగునీటి సౌకర్యం, పారిశుద్ధ్య నిర్వహణ, ఘాట్ల నిర్మాణం, రహదారి మరమ్మతులు, పార్కింగ్ తదితర ఏర్పాట్లు చేశారు. రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల నుంచి కాళేశ్వరానికి ఆర్టీసీ ప్రత్యేక బస్సులు ఏర్పాటుచేసింది. ప్రతిరోజు సగటున లక్షన్నర మంది వస్తారని దేవాదాయశాఖ అంచనా వేసింది.

# హైదరాబాద్, ముంబయిలో ఈడీ సోదాలు..

## రూ.32 కోట్ల నగదు, బంగారం స్వాధీనం

మొదటిపేజీ తరువాయి
హైదరాబాద్: ముంబయి వసాయి విరార్ మున్సిపల్ కార్పొరేషన్ స్కామ్‌లో దర్యాప్తును ఈడీ ముమ్మరం చేసింది. దర్యాప్తులో భాగంగా గురువారం ముంబయి, హైదరాబాద్‌తో పాటు 13 ప్రాంతాల్లో ఏకకాలంలో సోదాలు నిర్వహించింది. రూ.9.04 కోట్ల నగదు, రూ.23.25 కోట్లు విలువ చేసే బంగారం, వజ్రాలు స్వాధీనం చేసుకున్నట్టు ఈడీ తెలిపింది.

ముంబయిలోని మిరా భయాందర్ కమిషనరేట్ పరిధిలో నమోదైన కేసుల ఆధారంగా ఈడీ మరో కేసు నమోదు చేసింది. ప్రభుత్వ, ప్రైవేటు స్థలాల్లో అక్రమ నిర్మాణాలకు 2009 నుంచి అనుమతులు ఇచ్చారు. ఈ కేసులో సీతారాం గుప్తా, అరుణ్ గుప్తా కీలక నిందితులుగా ఉన్నారు. నిందితులు అధికారులతో కలిసి ప్రభుత్వ స్థలంలో అక్రమ నిర్మాణాలు చేపట్టి ప్రజలకు విక్రయించినట్టు దర్యాప్తులో తేలింది. ఇందులో భాగంగా వీవీఎంసీ టౌన్‌ప్లానింగ్ డిప్యూటీ డైరెక్టర్ వైఎస్ రెడ్డి నివాసంలో ఈడీ సోదాలు నిర్వహించింది. సోదాల్లో నిందితుల ఇళ్లలో నగదు, బంగారు ఆభరణాలు స్వాధీనం చేసుకున్నట్టు ఈడీ తెలిపింది.

# యాదగిరిగుట్టను సందర్శించిన ప్రపంచ సుందరీమణులు

మొదటిపేజీ తరువాయి
టూరిజం విలేజ్‌గా గుర్తింపు తెచ్చుకున్న పోచంపల్లిని ఆఫ్రికా ఖండానికి చెందిన 25 దేశాల మిస్ వరల్డ్ పోటీదారులు సందర్శించారు. వారికి స్థానిక ప్రజలు ఘనస్వాగతం పలికారు. ఇక్కత్ చీరల ప్రత్యేకత, తయారీ విధానాన్ని విదేశీ అతిథులు పరిశీలించారు. పలువురు భామలు స్వయంగా చీరలను నేసి సంబరపడ్డారు.


# రాష్ట్రపతి, గవర్నర్‌కు గడువు ఎలా విధిస్తారు?

## సుప్రీంకోర్టుకు ద్రౌపదీ ముర్మూ ప్రశ్న..!



దిల్లీ: శాసనసభలు ఒకటికి రెండుసార్లు ఆమోదించిన బిల్లులను గవర్నర్లు ఆమోదం తెలపకుండా కాలయాపన చేయడం, రాష్ట్రపతి పరిశీలనలో ఉన్నవీ తీవ్ర జాప్యానికి గురికావడంపై సుప్రీంకోర్టు ఇటీవల సంచలన నిర్ణయం తీసుకున్న సంగతి తెలిసిందే. గతంలో ఎన్నడూ లేనివిధంగా ఈ అంశంలో గవర్నర్‌తో పాటు రాష్ట్రపతికీ గడువు విధించింది. దీనిపై ప్రథమ పౌరురాలు ద్రౌపదీ ముర్మూ ) తాజాగా స్పందించినట్లు తెలుస్తోంది. రాజ్యాంగంలో అలాంటి నిబంధనేదీ లేనప్పుడు.. సుప్రీంకోర్టు తీర్పు ఎలా ఇచ్చిందని ముర్మూ ప్రశ్నించినట్లు సమాచారం. ఈ మేరకు పలు ఆంగ్ల మీడియా కథనాలు వెల్లడించాయి.
రాజ్యాంగంలోని 143 ఆర్టికల్ కింద ఉన్న ప్రత్యేక అధికారాలను వినియోగించుకొని సుప్రీంకోర్టు తీర్పుపై రాష్ట్రపతి పలు ప్రశ్నలు సంధించినట్లు ఆ కథనాలు పేర్కొన్నాయి. ఈ ప్రశ్నలపై న్యాయస్థానం తమ అభిప్రాయాలను తెలియజేయాలని అడిగినట్లు తెలుస్తోంది. ఈ అంశంపై స్పందించేందుకు భారత ప్రధాన న్యాయమూర్తిగా నూతనంగా బాధ్యతలు చేపట్టిన జస్టిస్ బీఆర్ గవాయ్ త్వరలోనే రాజ్యాంగ ధర్మాసనం ఏర్పాటు చేసే అవకాశం ఉన్నట్లు సమాచారం.యుద్ధ విమానాలు నడుపుతున్నారుగా%ఔ% మహిళలకు ఆ ఉద్యోగాలు ఎందుకివ్వరు? రాష్ట్రపతి అడిగిన ప్రశ్నలు ఇవే.. రాజ్యాంగంలోని రాష్ట్రపతి లేదా గవర్నర్ అధికారాలను ఆర్టికల్ 142 కింద సుప్రీంకోర్టు తన సొంత అధికారాలతో ఎలా భర్తీ చేయగలదు?సుప్రీంకోర్టుకు ఉన్న ప్లీనరీ అధికారాలను రాష్ట్రాలు కేంద్రానికి వ్యతిరేకంగా దుర్వినియోగం చేస్తున్నాయా? రాష్ట్రపతి, గవర్నర్‌కు కోర్టులు గడువు ఎలా నిర్దేశిస్తాయి?
రాజ్యాంగంలోని ఆర్టికల్ 200 కింద బిల్లును సమర్పించినప్పుడు గవర్నర్ ముందున్న రాజ్యాంగపరమైన ఎంపికలు ఏమిటి? ఆర్టికల్ 201 కింద రాష్ట్రపతి, ఆర్టికల్ 200 కింద గవర్నర్ రాజ్యాంగ విచక్షణాధికారం ఉపయోగించడం న్యాయబద్ధమేనా? ఏంటీ తీర్పు..
తమిళనాడు శాసనసభ ఆమోదించిన 10 బిల్లులను ఆ రాష్ట్ర గవర్నరు ఆర్.ఎన్.రవి ఆమోదించకుండా తన వద్దే ఉంచుకోవడం సరికాదని ఈ ఏడాది ఏప్రిల్‌లో సుప్రీంకోర్టు స్పష్టంచేసింది. దీనికి సంబంధించి 415 పేజీల తీర్పు వెలువరించింది. రాష్ట్రాలు పంపే బిల్లులను రాష్ట్రపతి/గవర్నర్ గరిష్ఠంగా మూడు నెలల్లోగా ఆమోదించడమో, తిప్పి పంపించడమో చేయాలని నిర్దేశించింది. బిల్లులను రాష్ట్ర ప్రభుత్వానికి వెనక్కి పంపిస్తున్నట్లయితే అందుకు గల కారణాలనూ జత చేయాలని తెలిపింది. ఈ తీర్పు తర్వాత కూడా గవర్నర్లు బిల్లులపై జాప్యం చేస్తుంటే సర్వోన్నత న్యాయస్థానాన్ని నేరుగా ఆశ్రయించవచ్చని, గవర్నర్ల నిష్క్రియాపరత్వం న్యాయసమీక్ష పరిధిలోకి వస్తుందని స్పష్టంచేసింది. రాజ్యాంగ అధికరణం 142 ద్వారా అటువంటి సంపూర్ణ అధికారం సుప్రీంకోర్టుకు ఉందని జస్టిస్ జె.బి.పార్దీవాలా, జస్టిస్ ఆర్.మహాదేవన్ ధర్మాసనం తేల్చి చెప్పింది.

# తనకు తాను బోనులో నిల్చున్న న్యాయ వ్యవస్థ




• బోయిని సత్యనారాయణ, అడ్వకేట్

**• సుప్రీం కోర్ట్ ఉరిశిక్షను కూడా రద్దు చేసే అధికారం రాష్ట్రపతికి ఉన్నప్పుడు**

**• రాజ్యాంగ అధినేత రాష్ట్రపతి అధికారాలకు,సుప్రీం కోర్ట్ కాల వ్యవధి విధించవచ్చా!**

**• రాష్ట్రపతి కి కాలవ్యవధి నిర్ణయం పట్ల సుప్రీం కోర్ట్ వివరణ కోరుతూ రాష్ట్రపతి ద్రౌపది ముర్ము లేఖ**

**• న్యాయవ్యవస్థ ఇప్పుడు తనకు తాను బోనులో నిల్చున్నది.**

తమిళనాడు రాష్ట్ర ప్రభుత్వం అసెంబ్లీ లో పాస్ చేసి గవర్నర్ ఆమోదానికి పంపిన బిల్లులను తొక్కి పెట్టిన గవర్నర్,రాష్ట్రపతి ల విచక్షణాధికారానికి హద్దులు నిర్ణయించిన ఇద్దరు న్యాయమూర్తుల డివిజన్ బెంచ్ తీర్పు మనదేశంలో ఒక రాజ్యాంగ సంక్షోభాన్ని సృష్టించింది.

**• గవర్నర్,రాష్ట్రపతి ప్రభుత్వాలకు అధినేతలు. రాజ్యాంగానికి ప్రతినిధులు.**

ప్రతి శాసన సభ సమావేశాలకు ముందు గవర్నర్ "నా ప్రభుత్వం" అంటూ ప్రసంగం ప్రారంభిస్తారు.పార్లమెంట్ సమావేశాల్లో రాష్ట్రపతి "నా ప్రభుత్వం" అంటూ ముందుగా ప్రసంగం చేస్తారు.తర్వాత ఈ సభలు గవర్నర్,రాష్ట్రపతి ప్రసంగాల పట్ల కృతజ్ఞతలు తెలియజేస్తాయి.ఇది రాజ్యాంగ సంప్రదాయం.రాజ్యాంగ ప్రతినిధులైన గవర్నర్,రాష్ట్రపతులకు శాసన సభ,పార్లమెంటు తీర్మానాలకు మించిన విచక్షణాధికారం ఉంటుంది.శాసన సభల తీర్మానాలను కాదని పార్లమెంట్,రాష్ట్రపతి తీసుకున్న నిర్ణయాలు ఎన్నో మనకు ఉదాహరణలుగా ఉన్నాయి.ప్రత్యేక తెలంగాణ ఉద్యమాన్ని వ్యతిరేకిస్తూ ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ శాసన సభ ఒక తీర్మానం చేసింది. కిరణ్ కుమార్ రెడ్డి ముఖ్యమంత్రి గా ఉన్న అప్పటి శాసన సభ ప్రత్యేక తెలంగాణ రాష్ట్ర ఏర్పాటును వ్యతిరేకిస్తూ గవర్నర్ కు,రాష్ట్రపతికి, పార్లమెంట్ కు ఆ తీర్మాన ప్రతిని పంపింది.

**ఆ శాసన సభ తీర్మానం ఏమైంది? పార్లమెంట్ లో రద్దు అయింది.**

పార్లమెంట్ తెలంగాణ రాష్ట్ర ఆకాంక్షను సమర్థిస్తూ తీర్మానం చేసింది. ఆ తీర్మానాన్ని రాష్ట్రపతి కార్యాలయం ఆమోదించింది.తద్వారా ప్రత్యేక తెలంగాణ ఏర్పడింది. మరి శాసన సభ తీర్మానం,బిల్లు ఎలా తిరస్కరించబడింది? ఎందుకంటే దేశ ప్రజలకు ఆకాంక్షలు విస్తృత స్థాయిలో చర్చించి తగిన నిర్ణయాలు చేసే అవకాశం రాజ్యాంగ నిర్మాతలు, రాజ్యాంగ ప్రాదేశిక సూత్రాల్లో పదిలంగా పొందు పరిచారు.ఎప్పుడైనా, ఒక శాసన సభ తమ రాష్ట్రాన్ని ఒక సెపరేట్ దేశంగా ప్రకటిస్తూ ఒక బిల్లును పాస్ చేసి గవర్నర్ కు పంపితే గవర్నర్ గుడ్డిగా ఆమోదించాల్సిందేనా?ఆ గవర్నర్ రాష్ట్రపతి పరిశీలనకు ఆ బిల్లును పంపితే రాష్ట్రపతి ఆమోదించి తీరాల్సిందేనా? ప్రత్యేక దేశం గా తమ రాష్ట్రాన్ని ఏర్పాటు చేసుకుంటూ ప్రకటించుకుంటూ శాసన సభ చేసుకున్న తీర్మానం పై మూడు నెలల్లో గనుక గవర్నర్లు,రాష్ట్రపతి నిర్ణయం తీసుకోక పోతే ఆ బిల్లు ఆమోదినట్టు గా ఆ శాసన సభ ప్రకటించుకొని స్వయం నిర్ణయాధికారంతో ఈ దేశం నుండి విడిపోయే హక్కు పొందినట్టేనా?

అపుడు మెజారిటీ రాష్ట్రాల సమర్థన ఉండాల్సిందేనని రాజ్యాంగం సూచించింది.

ఇలా ఒక బిల్లు చట్టంగా మారే క్రమంలో రాజ్యాంగ వివేచన అతి ముఖ్యం.

**• సుప్రీం కోర్ట్ డివిజన్ బెంచ్ తీర్పు రాజ్యాంగ సంక్షోభం సృష్టించినట్టు కాదా?**

**• రాజ్యాంగ నిర్మాతలు, డాక్టర్ బాబా సాహెబ్ అంబేద్కర్ కలిసి రాజ్యాంగ సంక్షోభ నివారణకు, అతి సూక్ష్మ విషయాల పట్ల, దూరదృష్టితో పరిష్కార సూచనలు పొందుపర్చారు**

రాజ్యాంగ నిర్మాతల దూరదృష్టి ప్రతి కోణాన్ని తాకింది. ఒక శాసన సభ మెజారిటీ సభ్యుల తీర్మానంతో చేసే తీర్మానం దేశ హితం,ప్రజా హితం అవుతుందని భావించలేము.

"మెజారిటీ ఈజ్ లా" అవుతుందేమో గానీ, మెజారిటీ నిర్ణయం న్యాయం కాకపోవచ్చు. ధర్మం కాకపోవచ్చు.ఇటువంటి సందేహం తలెత్తినప్పుడు రాష్ట్రపతి రాజ్యాంగ నిపుణుల కమిటీ వేసి సంక్షోభ నివారణకు మార్గం కనుక్కోవాలని రాజ్యాంగం సూచించింది.

రాజ్యాంగ నిపుణులు సూచించిన విషయాలను సుప్రీం కోర్ట్ ఫుల్ బెంచ్ రాజ్యాంగ పీఠం ఒక కొత్త నిర్దేశంతో తీర్పు వెలువరించాలి. దానిని పార్లమెంట్ ఆమోదించి చట్టం చేయాలి.

**• ఇవేవీ లేకుండా సుప్రీం కోర్ట్ లో ఇద్దరు న్యాయమూర్తులు వెలువరించిన తీర్పు హేతుబద్ధత ఇప్పుడు ప్రశ్నార్థకమయింది.సుప్రీం కోర్ట్ తీర్పు పట్ల దేశ వ్యాప్తంగా నిరసనలు, అభిప్రాయాలు చెలరేగాయి.**

చట్టాలు చేసే శాసన సభ, పార్లమెంట్ లో కూడా ఉండేది వ్యక్తులే. ఆ వ్యక్తుల భావావేశాలు, ప్రభుత్వాధినేతల ప్రయోజనాలు రాజ్యాంగ బద్ధం అని భావించి మిన్నకుండి పోవడమేనా? అంతకు మించి ఎవ్వరికీ వివేకం ఉండదా? ఇదేనా రాజ్యాంగ నిర్దేశం?..

**• భారత రాజ్యాంగం కేవలం సాంకేతిక పుస్తకం కాదు భారత రాజ్యాంగం ఈ దేశ ప్రజల ఆత్మ.**

కోర్టుల్లో కక్షిదారులు కూడా "అంతా నిజమే చెబుతాను,అబద్ధం చెప్పను" అని ఆత్మ సాక్షిగా ప్రమాణం చేస్తారు.కేసును ఆసాంతం విన్న న్యాయమూర్తి కూడా "నాకు తెలిసినంతవరకు" Best of my knowledge.. అని తీర్పు వెలువరిస్తారు.సాంకేతిక అంశాలు,సాక్ష్యాలు దాటి న్యాయమూర్తి కూడా తన విచక్షణను అవగాహనను రంగరించి,ఇది న్యాయం అని భావించి తీర్పు వెలువరిస్తారు.చట్టం న్యాయం కేవలం సాంకేతిక అంశం మాత్రమే కాదని, మన న్యాయ వ్యవస్థ లోని వ్యక్తులు సాంకేతిక అంశాలను మించిన ఒక సంప్రదాయాన్ని ఆచరిస్తున్నారు.తమిళ నాడు అసెంబ్లీ బిల్లుల పట్ల సుప్రీం కోర్ట్ డివిజన్ బెంచ్ లోని ఇద్దరు న్యాయమూర్తుల తీర్పు కూడా ప్రజల అవగాహనకు అందాల్సిందే అని విజ్ఞుల అభిప్రాయం. అది న్యాయమైన అభిప్రాయం కూడా.నిన్న భారత రాష్ట్రపతి సుప్రీం కోర్ట్ కు రాసిన లేఖ ఇప్పుడు రాజ్యాంగ సంక్షోభ నివారణకు ఇకపై ఒక మార్గ దర్శనం చేయాలన్నదే అందరి అభిప్రాయం,ఆకాంక్ష.

**• రాష్ట్రపతి లేఖ లోని అంశాలు చదవండి**

సుప్రీంకోర్టుకు రాష్ట్రపతి ద్రౌపది ముర్ము సంచలన ప్రశ్నలు సంధించారు. రాష్ట్ర ప్రతి, గవర్నర్లకు కూడా సుప్రీంకోర్టు డెడ్ లైన్లు విధించగలరా అని ప్రశ్నించారు. తమిళనాడు కేసులో.. రాష్ట్రాలు పంపే బిల్లులను రాష్ట్రపతి, గవర్నర్ గరిష్ఠంగా మూడు నెలల్లోగా ఆమోదించడమో, తిప్పి పంపించడమో చేయాలని, బిల్లులను రాష్ట్ర ప్రభుత్వానికి వెనక్కి పంపిస్తున్నట్లయితే అందుకు గల కారణాలనూ జత చేయాలని సుప్రీంకోర్టు పేర్కొంది. నెల రోజుల క్రితం సుప్రీంకోర్టు ఇందుకు సంబంధించి 415 పేజీల తీర్పు వెలువరించింది.




తాజాగా.. రాష్ట్రపతి ద్రౌపది ముర్ము పలు ప్రశ్నలు సంధిస్తూ సుప్రీంకోర్టుకు లేఖ రాశారు. గవర్నర్ల పై గడువులు విధించొచ్చా అని ఆ లేఖలో ద్రౌపది ముర్ము ప్రశ్నించారు.

రాష్ట్రపతి ద్రౌపది ముర్ము సుప్రీంకోర్టుకు రాసిన లేఖలో 14 ప్రశ్నలు అడిగారు. ఈ ప్రశ్నలన్నీ గవర్నర్, రాష్ట్రపతి అధికారాలకు సంబంధించినవి. అదేవిధంగా.. రాష్ట్రపతి అడిగిన ప్రశ్నలు రాజ్యాంగంలోని ఆర్టికల్స్ 200, 201, 361, 143, 142, 145(3), 131లకు సంబంధించినవి. బిల్లు తన వద్దకు వచ్చినప్పుడు గవర్నర్ కు ఏ ఎంపిక ఉంటుంది..? మంత్రి మండలి సలహాలను గవర్నర్ పాటించాల్సిన అవసరం ఉందా..? అని ద్రౌపది ముర్ము సుప్రీంకోర్టుకు రాసిన లేఖలో ప్రశ్నించారు.

**రాష్ట్రపతి అడిగిన ప్రశ్నలు ఇవే..**

- రాష్ట్రపతి, గవర్నర్‌కు కోర్టులు గడువు ఎలా నిర్దేశిస్తాయి?
- రాజ్యాంగంలోని ఆర్టికల్ 200 కింద బిల్లును సమర్పించినప్పుడు గవర్నర్ ముందున్న రాజ్యాంగపరమైన ఎంపికలేంటి?
- రాజ్యాంగంలోని రాష్ట్రపతి లేదా గవర్నర్ అధికారాలను ఆర్టికల్ 142 కింద సుప్రీంకోర్టు తన సొంత అధికారాలతో ఎలా భర్తీ చేయగలదు?
- సుప్రీంకోర్టుకు ఉన్న ప్లీనరీ అధికారాలను రాష్ట్రాలు కేంద్రానికి వ్యతిరేకంగా దుర్వినియోగం చేస్తున్నాయా?
- రాజ్యాంగంలోని 361వ అధికరణం, 200వ అధికరణం కింద గవర్నర్ చర్యలకు సంబంధించి న్యాయ సమీక్షపై పూర్తి నిషేధం విధిస్తుందా?
- ఆర్టికల్ 201 కింద రాష్ట్రపతి, ఆర్టికల్ 200 కింద గవర్నర్ రాజ్యాంగ విచక్షణాధికారం ఉపయోగించడం న్యాయబద్ధమేనా?
- రాజ్యాంగంలో రాష్ట్రపతి అధికారాల మేరకు ఆర్టికల్ 143 కింద సుప్రీం కోర్టు సలహాను పొందడానికి లేదా గవర్నర్, రాష్ట్రపతి అనుమతి కోసం బిల్లును రిజర్వ్ చేయడం లేదా ఇతర విధంగా సుప్రీంకోర్టు అభిప్రాయం పొందడం అవసరమా?

## గురుకుల అధ్యపకురాలు పుష్పలతకు గణిత శాస్త్రంలో ఓయు పిహెచ్ డాక్టరేట్ పట్టా

**శామీర్ పేట, ప్రతినిధిమే 15 నేటితరం.**

కింది స్థాయి కుటుంబంలో ఎన్నో సమస్యలను అదిగమిస్తు ఎంతో శ్రద్ధ వహించి చదువుతు ఓ అధ్యాపకురాలు ఎట్టకేలకు ఓయు డాక్టరేట్ పట్టాను సాదించింది. శామీర్ పేట మండలం లాల్గడి మలక్ పేట గ్రామానికి చెందిన కత్తి యాదగిరి భార్య కత్తి పుష్పలత 2019 నుంచి సాంఘీక సంక్షేమ డిగ్రి కళాశాల్లో ప్రభుత్వ అధ్యాపకురాలు(లెక్షరర్)గా పని చేస్తో ంది. సిద్దిపేట జిల్లా, దౌల్తాబాద్ మండలం, షేర్పల్లి బందారం గ్రామానికి చెందిన చిన్నబాలయ్యబాలవ్వ దంపతుల కుమార్తె పుష్పలత 2022లో లాల్గడి మలక్ పేటకు చెందిన కత్తి యాదగిరితో వివాహం జరిగింది. అధ్యాపకురాలు పుష్పలత గణితంలో న్యూమరికల్ స్టడీ ఆఫ్ ఎంహెచ్ డార్కి ఫోర్స్ కీమర్ ఫ్లో ఆఫ్ నాన్ న్యూటేనియన్ నానో ఫ్లూయిడ్స్ అనే అంశంపై గైడ్ ప్రొఫెసర్ శంకర్ పర్యవేక్షణలో ఉస్మానియా విశ్వవిద్యాలయంలోని గణిత విభాగం లో పరిశోధన పూర్తి చేసింది. అందుకు గాను 108 ఏళ్ళ ప్రతిష్టాత్మకమైన చరిత్ర కలిగిన ఓయు అధ్యాపకురాలు పుష్పలతకు గురువారం పిహెచ్ఎ డాక్టరేటు ప్రకటించింది. కాగా పుష్పలతకు చిన్నప్పటి నుంచి టెన్త్, ఇంటర్, డిగ్రి, బిఎడ్ విద్య నుంచి






గణితంపై ఎంతో మక్కువ, అత్యుత్తమ ప్రతిభను సాదించింది. అనంతరం ఉస్మానియా విశ్వవిద్యాలయంలో ఆమె పిజి పిహెచ్ఎ గణితంలో ఆరేళ్ళ పాటు పరిశోధన చేసి పూర్తిచేసేసింది. కాగా పిహెచ్ఎలో చేరిన తరువాత తండ్రి మరణించిన ప్పటికి ఆ బాదను దిగమింగుతు ఇంటికి పెద్ద దిక్కై ఓ ప్రక్క వ్యవసాయ పనులను చేస్తునే మరో ప్రక్క పరిశోధనలు చేస్తు, హెూం ట్యూషన్స్ చెపుతు కుటుంబ సభ్యులైన తమ్ముళ్ళను, చెళ్ళలను చదివించింది. పుష్పలత పేదరికంతో ఓ ప్రక్క కుటుంబాన్ని పోషిస్తు మరో ప్రక్క ప్రభుత్వ ఉద్యోగాన్ని సాధించేందుకై పట్టు వీడకుండ ఎన్నో ప్రయత్నాలు చేసింది. 2019లో ప్రభుత్వ గురుకుల బీసీ వెల్ఫేర్ కళాశాల్లో ఎట్టకేలకు జూనియర్ లెక్షరర్గాగా ప్రభుత్వ ఉద్యోగాన్ని సాధించింది. అంతటితో ఆగకుండ పుష్పలత ఆదే సంవత్సరం 2019లో ప్రభుత్వ సోషల్ వెల్ఫేర్ గురుకుల డిగ్రి కళాశాల్లో డిగ్రి లెక్టరర్గాగా ప్రభుత్వ ఉద్యోగాన్ని సాధించింది. కాగా పుష్పలత అంతటితో ఆగకుండ అత్యున్నత స్థాయికి వెల్లాలన్న దృఢ సంకల్పంతో లెక్షరర్ పుష్పలత ఓ ప్రక ఉద్యోగం చేస్తు ఎన్నో కష్టాలను బరిస్తు తోటి అధ్యాపకుల సహకారంతో గణిత శాస్త్రంలో పిహెచ్ఎ పరిశోధనను మొదలు పెట్టి ఆరు సంవత్సరాల పాటు ఎంతగానో శ్రమించి ఎట్టకేలకు పూర్తి చేసి ఉస్మానియ యూనివర్సిటిలో పిహెచ్డి డాక్టరేట్ పట్టాను సాధించింది. కాగా గురువారం అధ్యాపకురాలు పుష్పలతకు పిహెచ్ఎలో డాక్టరేట్ పట్టాను ఓయు ప్రకటించగా గైడ్ ఓయు ప్రొఫెసర్ శంకర్ ఆమెకు ప్రధానం చేశారు. ఈ సందర్భంగా పిహెచ్ డి డాక్టరేట్ సాధించినందుకుగాను అధ్యాపకురాలు పుష్పలతను గురువారం కుటుంబ సభ్యులు, బందువులు, అభిమానులు, గ్రామస్తులు ఎంతగానో అభినందించారు.

## డ్రంక్ అండ్ డ్రైవ్ లో ఒక వ్యక్తికి 3 రోజుల జైలు శిక్ష

**- గజ్వేల్ ట్రాఫిక్ ఇన్స్పెక్టర్ మురళి**

**గజ్వేల్ మే 15, కరపత్రం ప్రతినిధి**

గజ్వేల్ ట్రాఫిక్ పోలీసుల వాహన తనిఖీలలో మద్యం సేవించి వాహనాలు నడిపిన 06 మందికి 7,000/- జరిమానా, ఒక వ్యక్తికి 3 రోజుల జైలు శిక్ష గజ్వేల్ ట్రాఫిక్ సీఐ మురళి, సిబ్బందితో గత కొన్ని రోజుల క్రితం గజ్వేల్ పట్టణంలో పిడిచెడ్ రోడ్, క్యాసారం ఎక్స్ రోడ్, తూప్రాన్ రోడ్, ముట్రాజ్ పల్లి రోడ్డు, సంగాపూర్ రోడ్, మరియు ఔటర్ రింగ్ రోడ్డు పరిసర ప్రాంతాలలో వాహనాలు తనిఖీ చేయగా, 06, మంది వ్యక్తులు మద్యం సేవించి వాహనాలు నడుపుతుండగా పట్టుకొని బ్రీత్ ఎనలైజర్ తో తనిఖీ చేయగా మద్యం సేవించి ఉన్నారని రిపోర్టు రాగా గురువారం గజ్వేల్ జ్యుడీషియల్ ఫస్ట్ క్లాస్ మెజిస్ట్రేట్ శ్రీమతి స్వాతి గౌడ్, ముందు హాజరుపరచగా విచారణ చేసి 06 మందికి 7,000/-వేల రూపాయల జరిమాన, ఒక వ్యక్తికి 3 రోజుల జైలు శిక్ష విధించారు జైలు శిక్ష పడిన వారి వివరాలు ఆశని నవీన్ తండ్రి రామయ్య, నివాసం కొల్గూర్, మండలం గజ్వేల్.ఈ సందర్భంగా ట్రాఫిక్ సిఐ మురళి మాట్లాడుతూ మద్యం సేవించి వాహనాలు నడవదని, మరియు రోడ్డు నిబంధనలు, ట్రాఫిక్ నిబంధనలు పాటించే వాహనాలు నడపాలని, రోడ్డు ప్రమాదాల నివారణ గురించి మాత్రమే ప్రతిరోజు డ్రంక్ అండ్ డ్రైవ్ టెస్ట్ నిర్వహించడం జరుగుతుందన్నారు.

## కోలన్ హన్మంత్ రెడ్డి చొరవతో సిసి రోడ్డు నిర్మాణ పనులు ప్రారంభం

**కుత్బుల్లాపూర్, మే 15 కరపత్రం ప్రతినిధి**

ప్రజా సమస్యల పరిష్కారమే ధ్యేయంగా కాంగ్రెస్ ప్రభుత్వం పని చేస్తుందని కుత్బుల్లాపూర్ నియోజక వర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ కోలన్ హన్మంత్ రెడ్డి అన్నారు. ఈ మేరకు ఆయన గురువారం గాజులరామారం డివిజన్ పరిధిలోని కైసర్ నగర్ లో నూతన సీసీ రోడ్డు నిర్మాణ పనులను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కైసర్ నగర్ లో రోడ్లు పాడైపోయి స్థానిక ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని అన్నారు. ఇటీవల ఈ సమస్యలు స్థానిక ప్రజలు తన దృష్టికి తీసుకువచ్చారని అన్నారు. వెంటనే స్పందిస్తూ ఇన్చార్జి మంత్రి శ్రీధర్ బాబు దృష్టికి తీసుకువెళ్లాలని అన్నారు. ఆయన చొరవతో 22 లక్షల ప్రత్యేక నిధులను కేటాయించారని అన్నారు. మంత్రి సహాయ సహకారాలతో రాబోయే రోజుల్లో కూడా నియోజకవర్గ అభివృద్ధికి తన వంతు సహాయ సహకారాలు అందిస్తానని అన్నారు. ఈ సందర్భంగా బస్తీవాసులు హర్షం వ్యక్తం చేస్తూ కోలన్ హన్మంత్ రెడ్డినీ శాలువాతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో డీసీసీ ఉపాధ్యక్షులు దమ్మని శ్రవణ్ కుమార్, సీనియర్ కాంగ్రెస్ నాయకులు సిద్దనోళ్ల సంజీవ్ రెడ్డి, 127 డివిజన్ అధ్యక్షులు పెరిక శివ, డివిజన్ మైనారిటీ అధ్యక్షులు సయ్యద్ షఫీ, సమీర్ ఖాన్, ఐ మధ్, ఎం. డీ అజీమ్, ఎం. డీ ఇమ్రన్, ఆసిఫ్ ఖాన్ , శారీఫ్, జఫ్ఫార్, మహేందర్, ఎం. డి ఆసిఫ్ మరియు కాంగ్రెస్ నాయకులు తదితరులు పాల్గొన్నారు...

## ఐడియా అదిరింది బాసు..

**- ఇంటి వద్దకే టైలరింగ్ సేవలు**

**కృష్ణాజిల్లా పెనమలూరు కరపత్రం ప్రతినిధి**

ప్రతి మనిషికి కష్టాలు, సమస్యలు సహజం. సమస్యలు వచ్చినప్పుడు కుంగిపోకుండా కాస్తా మనసు పెడితే ఎలాంటి సమస్యకైనా పరిష్కారం ఇట్టే దొరుకుతుంది అందుకు పెద్ద, పెద్ద చదువులు చదుకోవాల్సిన అవసరం లేదని గతంలో చాలా మంది నిరూపించారు. తాజాగా ఓ దర్జీ కూడా అదే బాటలో పయనించాడు. ప్రస్తుతం టైలరింగ్ వృత్తిలో అనేక మార్పులు వచ్చాయి. రెడీమేడ్ దుస్తువులు, డిజైనరీ బోటిక్స్ పుణ్యమా అని సాధారణ టైలర్లకు చేతినిండా పనిలేకుండా పోతోంది. దీంతో పూట గడవని స్థితిలోకి కొంతమంది టైలర్లు వెళ్లిపోతున్నారు.




ఈ క్రమంలో కృష్టా జిల్లాకు చెందిన టైలర్ షేక్ కాలేషా వినూత్నంగా ఆలోచించాడు. ప్రస్తుత రోజుల్లో అన్ని సేవలు ఇంటి వద్దకే రావటాన్ని గమనించి, టైలరింగ్ సేవలను కూడా ఇంటి వద్దకు తీసుకెళ్లాలని అనుకున్నాడు. మరీ ఆ వివరాలేంటో ఈ కథనంలో తెలుసుకుందాం. కృష్ణాజిల్లా పెనమలూరు మండలం వణుకూరుకు చెందిన షేక్ కాలేషా టైలర్ వృతితో జీవితాన్ని కొనసాగిస్తున్నాడు. తొలుత గ్రామంలో టైలరింగ్ దుకాణాన్ని నిర్వహించేవాడు. అయితే, కాలక్రమేణ షాపుకు ఆదరణ తగ్గిపోయింది. కొంత మంది బట్టలు కుట్టించుకున్నా ఇచ్చే మొత్తం కంటే, అప్పులు పెట్టేదే ఎక్కువైంది. దీంతో కుటుంబ జీవనం కష్టంగా మారింది. వేరే పని వెత్తుకుందామా అంటే.. తెలిసింది టైలరింగ్ పని ఒక్కటే. టైలరింగ్ వృత్తి ద్వారానే ఏదో విధంగా ఆదాయం పెంచుకోవాలని భావించాడు. ఈ క్రమంలో మొబైల్ టైలరింగ్ ద్వారా ఉపాధి పొందాలనుకున్నాడు. ఈ ఆలోచనలో భాగంగా తొలుత ఓ రిక్షాను కొని దానికి కుట్టుమిషన్ను అనుసంధానించాడు. ఎక్కడికైనా తీసుకుని వెళ్లేందుకు అనుగుణంగా మార్పులు చేశారు. గ్రామంలో కాలనీల్లో తిరుగుతూ ఇంటి వద్దే పాత, చిరిగిన బట్టలు కుట్టడం ప్రారంభించాడు. ఈ సేవలకు మంచి ఆదరణ లభించటంతో.. టీవీఎస్ ద్విచక్ర వాహనాన్ని కొనుగోలు చేసి పొరుగుళ్లకు తన సేవలను విస్తరించుకున్నాడు. రోజుకో గ్రామం చొప్పున తిరుగుతూ ఉపాధి పొందుతున్నాడు.

# అకాల వర్షంతో...రైతన్నలు ఆగమాగం




**కరపత్రం ప్రతినిధి అందోలు :**
అకాల వర్షాలు అన్నదాతలను ఆగం చేస్తున్నాయి. దీంతో ఆరుగాలం కష్టపడి పండించిన పంటలు వర్షార్పణం అవుతుండడంతో రైతులు కన్నీళ్ల పర్యంతమవుతున్నారు. ధాన్యం కొనుగోళ్లు ఇంకా పూర్తి కాకపోవడంతో రైతుల బాధలు వర్ణనాతీతంగా మారాయి. సంగారెడ్డి జిల్లా అందోల్ మండలంలో గురువారం తెల్లవారు జాము నుండి ఎడతెరిపి లేకుండా కురిసిన భారీ వర్షానికి కొనుగోలు కేంద్రాలతో పాటు..రోడ్లపై ఆరబెట్టిన వరి ధాన్యం వరద నీటిలో కొట్టుకుపోయింది. సంబంధిత అధికారుల నిర్లక్ష్యం కారణంగానే ధాన్యం తడుస్తున్నాయని రైతులు ఆరోపిస్తున్నారు. సకాలంలో వడ్లు తూకం వేసి కొనుగోలు చేస్తే రైతులకు ఇబ్బందులు ఉండవని.. కనీసం టార్పలిన్ కవర్లు అందజేసి ఉంటే ధాన్యం తడిసేది కాదని రైతులు ఆందోళన చెందుతున్నారు. మండలంలోని కొనుగోలు కేంద్రాలు, రోడ్లు.. పంట పొలాల వద్ద రైతులు ఆరబెట్టిన వడ్లు పూర్తిగా వర్షానికి తడిసి ముద్దయ్యాయి మరికొన్ని వర్షపు వరదలో కొట్టుకుపోయాయి. మండల పరిధిలోని రోళ్లపాడ్, డాకూర్ తాడుమన్నూరు బ్రాహ్మణపల్లి అక్సాన్పల్లి అన్నా సాగర్ ఇలా పలు గ్రామాల్లో వడ్ల కొనుగోలు కేంద్రాల్లో వర్షానికి ధాన్యం పూర్తిగా తడిసిపోయింది. సమయానికి కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం కొనకపోవడం..కొన్న ధాన్యాన్ని లారీల్లో తరలించకపోవడం..ధాన్యం ఆరబెట్టిన చోట టార్పలిన్ కవర్లు అందజేయకపోవడంతో పాటు సరైన సౌకర్యాలు లేక ఈ దుస్థితి వచ్చిందని రైతులు బోరున విలపిస్తున్నారు. తడిసిన ధాన్యాన్ని ప్రభుత్వం కొనుగోలు చేసి తమను ఆదుకోవాలని రైతులు కోరుతున్నారు.

# ఖనిలో సింగరేణి ఆధ్వర్యంలో మెగా జాబ్ మేళా

- 100 కంపెనీలు... 3 వేల ఉద్యోగ అవకాశాలు
- నిరుద్యోగ యువత సద్వినియోగం చేసుకోవాలి
- సీఎండీ ఎన్. బలరామ్



**కొమురయ్య నాగం,కరపత్రం ప్రతినిధి**
సింగరేణి ప్రాంత నిరుద్యోగ యువతకు వివిధ ప్రైవేట్ కంపెనీలలో ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించడం కోసం రామగుండం 1 ఏరియా గోదావరిఖనిలో ఆదివారం సింగరేణి ఆధ్వర్యంలో మెగా ఉద్యోగ మేళా నిర్వహించనున్నట్లు సింగరేణి ఛైర్మన్, ఎండీ ఎన్.బలరామ్ గురువారం ఒక ప్రకటనలో తెలియజేశారు. ఈ మెగా జాబ్ మేళాలో హైదరాబాద్ ప్రాంతానికి చెందిన సుమారు 100 ప్రైవేటు సంస్థల లో వివిధ విభాగాల్లో 3 వేల ఖాళీలు భర్తీ కోసం ఎంపిక జరుగుతుందన్నారు. నిరుద్యోగ యువత హైదరాబాద్ లాంటి నగరాలకు వెళ్లి ఉద్యోగాల కోసం ప్రయత్నాలు చేయడం వ్యయ ప్రయాసలతో కూడుకుని ఉంటోందని, ఈ నేపథ్యంలో పలు కంపెనీల ప్రతినిధులతో మాట్లాడి స్థానికంగా ఉద్యోగ మేళాలు నిర్వహిస్తున్నట్లు వెల్లడించారు. దీనిని నిరుద్యోగ యువత సద్వినియోగం చేసుకోవాలని పిలుపునిచ్చారు. ఇటువంటి జాబ్ మేళాలు ఇకపై ఇతర ఏరియాలలో కూడా నిర్వహించడం జరుగుతుందన్నారు. సింగరేణి సంస్థలో ఉద్యోగ నియామకాలతో పాటు, నిరుద్యోగ యువత అందరికీ ఏదో ఒక ఉపాధి లేదా ఉద్యోగం కల్పించడం కోసం ఈ తరహా కార్యక్రమాలను సింగరేణి సంస్థ స్వచ్ఛందంగా చేపడుతుందని, ఈ అవకాశాలను నిరుద్యోగ యువత సద్వినియోగం చేసుకోవాలని కోరారు.
సింగరేణి సంస్థ సింగరేణి ప్రాంత నిరుద్యోగ యువతకు ఉద్యోగ ఉపాధి అవకాశాలు కల్పించడం కోసం స్కిల్ డెవలప్మెంట్ సెంటర్లను ఇప్పటికే మందమర్రి, రామగుండం-1, భూపాలపల్లి ఏరియాలలో ప్రారంభించామని ఇతర ఏరియాలలో కూడా త్వరలో ప్రారంభిస్తున్నామన్నారు. యువతలో నైపుణ్యాలు పెంచడమే కాకుండా వారికి ఉద్యోగ అవకాశాలను కల్పించేందుకు వీలుగా జాబ్ మేళాలను కూడా ఏర్పాటు చేయిస్తున్నట్లు వివరించారు.

# ఇల్లందకుంటలో కాంగ్రెస్ నాయకుల దిష్టి బొమ్మ దగ్ధం




**కరపత్రం ప్రతినిధి ఇల్లందకుంట మే 15**
ఇల్లందకుంట మండల కేంద్రంలోనీ గరుడ చౌరస్తా లో కాంగ్రెస్ నాయకుల దిష్టి బొమ్మ దగ్ధం చేయడం జరిగింది అనంతరం బీజేపీ సీనియర్ నాయకులు సింగిరెడ్డి తిరుపతి రెడ్డి మాట్లాడుతూ తెలంగాణ కాంగ్రెస్ అధ్యక్షులు మహేష్ కుమార్ గౌడ్ సీనియర్ నాయకులు జగ్గారెడ్డి బిజెపి మల్కాజ్గిరి ఎంపీ ఈటెల రాజేందర్ పైన అనుచిత వ్యాఖ్యలు చేసినారు. పీసీసీ అధ్యక్షులు ఈటల రాజేందర్ కులము ప్రస్తావన తీసుకొచ్చారు తెలంగాణ రాష్ట్రంలో కుల గణన చేసి దేశానికే ఆదర్శంగా నిలిచామని గొప్పలు చెప్పుకునే కాంగ్రెస్ ప్రభుత్వము మహేష్ కుమార్ గౌడ్ మీ కులగనలో ఈటల రాజేందర్ కులము నమోదు చేయలేదా, లేదా మీరు చేసిన కులగనన అంతా ఒక బూటకమా దీనికి సమాధానం చెప్పాలి. మీరు చేసిన కుల గణన సర్వేలో క్రిస్టియానిటీ మతం వారిని తక్కువగా చూపించడమే కాకుండా ముస్లింలను బీసీలలో కలిపి ఈ రాష్ట్రానికి సమాజానికి చాలా నష్టం చేశారు అది సరిపోదు అనుకోని ఇప్పుడు ఏకంగా సీనియర్ నాయకులు ఒక పార్లమెంటు సభ్యుడును పట్టుకొని నీ కులం ఏంటని అడిగి కులాల మధ్య చిచ్చు పెట్టడానికి ప్రయత్నిస్తున్నారా తెలంగాణ ప్రజలు మీకు అధికారం ఇచ్చింది ఎందుకేనా ఒక్కసారి ఆలోచన చేయాలి. ఇక జగ్గారెడ్డి విషయానికి వద్దాం ఆయనే ఎప్పుడు ఎవరిమీద పిచ్చి పట్టిన కుక్కలాగా అరుస్తాడో ఎవరికీ తెలవదు ఇదే ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పైన గాని రాష్ట్రంలో ఉన్న ఇతర నాయకుల పైన ఎప్పుడు ఏ విధంగా సంస్కారం లేని నాయకుడు అని చెప్పడానికి సిగ్గుపడే జగ్గారెడ్డి ఎలా ప్రవర్తన ఉంటుందో మాకంటే మీకే బాగా తెలుసు పత్రిక మిత్రులారా కాబట్టి అలాంటి నాయకుల పార్టీ కాంగ్రెస్ పార్టీ వారి గురించి మాట్లాడితే ఈ ప్రజాస్వామ్య దేశంలో అలాంటి వాళ్ళు రాజకీయాల్లో ఉన్నారంటేనే అసహ్యం వేస్తుంది ఆ భాష కానీ ఆ విధానం కాని చూస్తే తెలంగాణ రాష్ట్రంలో ఇలాంటివారా రాజకీయ నాయకులు అని అనుమానం కలిగేటట్టుగా ఉంది కాబట్టి రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కి నా విన్నపము ఇలాంటి సంస్కారం లేని మీ నాయకులను సస్పెండ్ చేస్తారు లేదా వారి నోటికి తాళం వేస్తారో ఆలోచించండి లేనియెడల తెలంగాణ సమాజమే మీ పైన కాంగ్రెస్ పార్టీ పైన తిరగబడి మిమ్మల్ని భూస్థాపితం చేయక తప్పదు ఈటల రాజేందర్ వ్యక్తిత్వము రాజకీయ జీవితాన్ని ఒకసారి ఆలోచన చేస్తే మనకు అర్థమవుతుంది రాజకీయాలలో అజాతశత్రువుగా ఉంటూ అందరినీ చిరునవ్వుతో పలకరిస్తూ విమర్శకులను కూడా సత్యమర్మగా తీసుకొని రాజకీయాలు చేసే ఈటల రాజేందర్ పైనే ఈ విధంగా మాట్లాడుతున్నారు అంటే మిమ్మల్ని ఏమనాలి తెలంగాణ ఉద్యమ ప్రస్థానంలో ఈటెల రాజేందర్ ప్రస్థానము ఎంతో విశిష్టము ప్రత్యేకము ఉద్యమ సమయంలో ఉద్యమానికి కావలసిన ఆక్సిజన్ను అందించడమే కాకుండా కొవ్వొత్తిలా తను కరుగుతూ తెలంగాణ ఉద్యమానికి ఏ విధంగా సేవలందించారో మనకందరికీ విధితమే కాబట్టి మిత్రులారా తెలంగాణ రాష్ట్రము ఆదర్శంగా ఉండాలంటే మన నాయకుల మాట తీరు నడక నడత ఆదర్శంగా ఉండాలని ఈ సందర్భంగా కోరుకుంటున్నాము. ఈ కార్యక్రమంలో సింగిరెడ్డి తిరుపతి రెడ్డి,కొత్త శ్రీనివాస్,కంకణాల సురేందర్ రెడ్డి,గురుకుంట్ల సాంబయ్య, ఎండి షఫీ ఖాన్,శీలం శ్రీనివాస్,కందాల రాజేందర్,గుత్తికొండ రాంబాబు,మట్ట పవన్ రెడ్డి, బక్కతట్ల రాజయ్య,ఉప్పు దుర్గన్న,మట్ట బాల్ రెడ్డి,బండి రాజు, దురిశెట్టి ఓంకార్,చదువు సాయి రెడ్డి, కళాల సంజీవ్,తుపాకుల సతీష్,జోడు సంపత్,నూనె శివ, బక్కతట్ల రాకేష్,కమ్మగోని అజయ్,బీనవేని అనిల్,మట్ట సుధాకర్ రెడ్డి,తిప్పరబోయిన సమ్మయ్య,నర్రా మధుకర్ రెడ్డి,శ్రావణ్,మేకల మురళి,అశోక్,సంజీవ్,చంద్రమౌళి,రవి,స్వామిదాసు,తదితరులు పాల్గొన్నారు.

# రీజినల్ రింగ్ రోడ్ విస్తరణ పనుల వేగవంతం చేయాలి..

- జిల్లా కలెక్టర్ క్రాంతి వల్లూరు



**కరపత్రం ప్రతినిధి సంగారెడ్డి ప్రతినిధి:**
రీజినల్ రింగ్ రోడ్ కు భూములు ఇచ్చిన రైతులకు పరిహారం చెల్లింపులు ప్రామాణికంగా ఉండాలని సంగారెడ్డి జిల్లా కలెక్టర్ క్రాంతి వల్లూరు అన్నారు. గురువారం ఉమ్మడి మెదక్ జిల్లా పరిధిలో భూసేకరణకు సంబంధించిన అంశాలపై కలెక్టరేట్ మినీ సమావేశ మందిరంలో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వ ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన రీజినల్ రింగ్ రోడ్ (RRR) విస్తరణ పనుల ప్రగతిని వేగవంతం చేయాలన్నారు. భూములు అందించిన రైతులకు వెంటనే పరిహారం అందించాలని కలెక్టర్ స్పష్టంగా పేర్కొన్నారు. నష్టపరిహారం చెల్లింపుల్లో పారదర్శకత పాటించాలని, ప్రతి రైతుకు న్యాయం జరగాలన్నారు. ప్రతి గ్రామంలో భూసేకరణకు సంబంధించిన పూర్తి వివరాలు అందుబాటులో ఉండాలి. ప్రాజెక్టు ప్రాముఖ్యతపై ప్రజల్లో అవగాహన అవసరం అన్నారు. సర్వే ప్రక్రియ నుంచి పరిహార చెల్లింపుల వరకు ప్రతీ దశలో అధికారుల బాధ్యత అన్నారు. రైతుల నుండి స్వచ్ఛందంగా భూములు సేకరించేలా అవగాహన కల్పించాలన్నారు. పరిహారం చెల్లింపులు ప్రామాణికంగా ఉండాలన్నారు. భూములను అందించిన రైతులకు న్యాయం చేయాలన్నదే ప్రభుత్వ లక్ష్యమని కలెక్టర్ తెలిపారు. రైతుల భూమికి తగినంత నష్టపరిహారం చెల్లించేందుకు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. వాస్తవిక మార్కెట్ విలువ ఆధారంగా పరిహారం నిర్ణయించాలన్నారు. అదనపు కలెక్టర్లు, ఆర్డీఓలు సమావేశంలో మాట్లాడారు. కొన్ని ప్రాంతాల్లో భూసేకరణకు సంబంధించి రైతుల్లో అభిప్రాయ బేధాలు, సర్వేలో సాంకేతిక సమస్యలు, స్థానిక స్థాయిలో అవగాహన లోపం వంటి అంశాలు ఉన్నాయని వారు తెలియజేశారు. ఈ రహదారి పూర్తయితే హైదరాబాద్ చుట్టూ ఉన్న జిల్లా కేంద్రాలు, ప్రధాన పట్టణాలతో వేగవంతమైన అనుసంధానం ఏర్పడుతుందని. వాణిజ్య, పారిశ్రామిక అభివృద్ధికి మేలు చేస్తుందని తెలిపారు. ప్రభుత్వ అభివృద్ధి కార్యక్రమాలు విజయవంతంగా ముందుకు సాగాలంటే అధికారులు నిబద్ధతతో పనిచేయాల్సిన అవసరం ఉందని కలెక్టర్ స్పష్టం చేశారు. ఈ సమావేశంలో రెజినల్ అధికారి శివశంకర్, యాదాద్రి భువనగిరి జిల్లా అధికారులు, ఉమ్మడి జిల్లా అదనపు కలెక్టర్లు, ఆర్డీఓలు, సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.

# ఐ ఎఫ్ డబ్ల్యూ జె జాతీయ అధ్యక్షులు కోటంరాజు విక్రమ్ రావు మృతి తీరనిలోటు..



-టి డబ్ల్యూ జే ఎఫ్ వేములవాడ అధ్యక్షులు తొగరి కరుణాకర్ వేములవాడ,

**కరపత్రం ప్రతినిధి వేములవాడ మే 15**
తెలంగాణా వర్కింగ్ జర్నలిస్ట్ ఫెడరేషన్ అనుబంధ యూనియన్ అయిన ఇండియన్ ఫెడరేషన్ ఆఫ్ వర్కింగ్ జర్నలిస్ట్ ( ఐ ఎఫ్ డబ్ల్యూ జె ) జాతీయ అధ్యక్షులు కోటంరాజు విక్రమ్ రావు మొన్న లక్నోలో మరణించిన విషయం తెలిసిందే. ఆయన మృతి పట్ల టిడబ్ల్యూజేఎఫ్ వేములవాడ నియోజకవర్గం అధ్యక్షులు తొగరి కరుణాకర్ ఆధ్వర్యంలో యూనియన్ తరుపున 2 నిముషాలు మౌనం పాటించి సంతాపం తెలియజేసారు. అనంతరం కరుణాకర్ మాట్లాడుతూ విక్రమ్ రావు మృతి యావత్ జర్నలిస్ట్ ల కుటుంబానికి తీరని లోటని విచారం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమం లో ప్రధాన కార్యదర్శి సుంకరి నరేందర్, కోశాధికారి బొప్ప భిక్షపతి, ఉపాధ్యక్షులు కవ్వల సురేందర్, ఏం ఏ రఫిక్, సయ్యద్ షబ్బీర్, సభ్యులు కళ్యాడపు వెంకటమల్లు, నిమ్మశెట్టి రాజు, గోపు ప్రవీణ్, చిద్రం ప్రసాద్, నడకట్ల మధు, పొలాస సంతోష్, కీర్తి సంజీవ్ తదితరులు పాల్గొన్నారు.

# మెగా జాబ్ మేళా ఏర్పాట్లు పరిశీలించిన ఎసిపి, జిఎం



**కొమురయ్య నాగం,కరపత్రం ప్రతినిధి**
గోదావరిఖని, పరిసర ప్రాంత నిరుద్యోగ యువతకు ఉపాధి అవకాశములు కల్పించుటకు రామగుండం ఏరియా1లో ఆదివారం మెగా జాబ్ మేళా నిర్వహణ కొరకు చేయవలసిన ఏర్పాట్లు ను గోదావరిఖని ఏసీపీ ఎం.రమేష్, అర్జి.1 జియం లలిత్ కుమార్ పోలీస్, సింగరేణి అధికారులతో కలిసి జవహార్ లాల నెహ్రూ స్టేడియం నందు స్థల పరిశీలన, జాబ్ మేళా కు హాజరై నిరుద్యోగ యువతి యువకులకు సరిపడు షామియానాలు, చల్లదనం కొరకు కూలర్స్, త్రాగు నీరు, హెల్ప్ డెస్క్ కౌంటర్లు, రిజిస్ట్రేషన్ కౌంటర్లు, ఇంటర్వ్యూల కొరకు ప్రత్యేక స్టాల్స్, స్టేజి ఏర్పాట్లు, అభ్యర్థుల ఎంట్రీ, ఎగ్జిట్ దారుల గురుంచి, పోలీస్ బందోబస్త్ ఏర్పాట్లపై అధికారులతో చర్చించారు. ఈ కార్యక్రమంలో గోదావరిఖని ఇన్స్పెక్టర్ ఇంద్ర సేనా రెడ్డి,డీజీఎం పర్సనల్ కిరణ్ బాబు, ఎస్.సి సివిల్ వర ప్రసాద్, వసంత్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

# ప్రమాదాల నివారణకు టర్నింగ్ పాయింట్ మరమ్మత్తు చర్యలు



**కొమురయ్య నాగం,కరపత్రం ప్రతినిధి**
రామగుండం పోలీస్ కమీషనరేట్ గోదావరిఖని పట్టణం లోని సింగరేణి బి గెస్ట్ హౌస్ వద్ద గల మూల మలుపు పాయింట్ వద్ద తరుచు ప్రమాదాలు జరుగడం వలన వాహనాల దారులు ప్రాణాలు కోల్పోవడం, గాయల పాలుకావడం,వాహనాలు దెబ్బతినడం జరుగుతుంది కావున రామగుండం పోలీస్ కమీషనర్ అంబర్ కిషోర్ ఝా ఆదేశాలు, రామగుండం ఎమ్మెల్యే రాజ్ ఠాకూర్ ఆలోచనల ప్రకారం ప్రమాదాల నివారణ ప్రజల వాహనదారుల రక్షణ, సురక్షితంగా వారి వారి గమ్య స్థానాలకు చేరేలాగా చేయడంలో భాగంగా మూల మలుపు వద్ద చేయవలసిన మార్పులు, మరమ్మత్తులు, నిర్మాణం ల గురించి గోదావరిఖని ఏసీపీ ఎం. రమేష్, రామగుండం ట్రాఫిక్ ఇన్స్పెక్టర్ రాజేశ్వర్ రావు, గోదావరిఖని వన్ టౌన్ ఇన్స్పెక్టర్ ఇంద్ర సేనారెడ్డి, హెచ్ ఆర్ కే, ఆర్ అండ్ బి అధికారులతో చర్చించి ఒక నివేదిక ఉన్నత అధికారులకు ఇవ్వడం జరుగుతుందని ఏసీపీ తెలిపారు.

# కామెడీ పేరుతో వేషాలా.. చట్టప్రకారం శిక్ష తప్పదు: సజ్జనార్ హెచ్చరిక

టీజీఎస్ఆర్టీసీ ఎండీ వీసీ సజ్జనార్ తాజాగాట్విట్టర్ వేదికగా స్పందిస్తూ..'ఇదేం వెర్రి కామెడీ!?. సోషల్ మీడియాలో ఫేమస్ కావడానికి ఎన్ని పిచ్చివేషాలైన వేస్తారా!? మీ పాపులారిటీ కోసం నిబద్ధత, అంకితభావంతో విధులు నిర్వహిస్తున్న ఆర్టీసీ ఉద్యోగులను ఇబ్బందులకు గురిచేస్తారా!? . కామెడీ పేరుతో ఆర్టీసీ సిబ్బందికి విధులకు ఆటకం కలిగిస్తే TGSRTC యాజమాన్యం ఏమాత్రం ఉపేక్షించదు. ఇలాంటి సోషల్ మీడియా పిచ్చిమాలోకాలపై పోలీస్ శాఖ సహకారంతో చట్టప్రకారం చర్యలు తీసుకుంటుంది' అని హెచ్చరికలు జారీ చేశారు. సోషల్ మీడియాలో ఫేమస్ కావడానికి ఎన్ని పిచ్చివేషాలైన వేస్తారా!? మీ పాపులారిటీ కోసం నిబద్ధత, అంకితభావంతో విధులు నిర్వహిస్తున్న ఆర్టీసీ ఉద్యోగులను ఇబ్బందులకు గురిచేస్తారా!? కామెడీ పేరుతో ఆర్టీసీ సిబ్బందికి విధులకు ఆటకం కలిగిస్తే TGSRTC యాజమాన్యం ఏమాత్రం